కస్టమర్ల విశ్వాసానికి.. పారదర్శక విధానాలకు.. ప్రతిరూపం
MESARA Infra Developers Limited

BNS
BHARAT NEWS SPECTRUM
ది న్యూ వాయిస్ అఫ్ న్యూ భారత్

కస్టమర్ల విశ్వాసానికి.. పారదర్శక విధానాలకు.. ప్రతిరూపం
MESARA Infra Developers Limited

సంపుటి - 01 | సంచిక -230 | తెలంగాణ ఆంధ్రప్రదేశ్ | 31-08-2026 | సోమవారం | పేజీలు : 4

# తెలంగాణలో పొలిటికల్ హీట్



- వెయ్యి రోజులపై విపక్షాల ఫోకస్
- హామీల వైఫల్యంపై బీఆర్ఎస్ పోరు
- సెప్టెంబర్‌లో వరుస నిరసనలు
- 22ఏ భూములపై బీజేపీ దీక్ష
- ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మహాధర్నా
- కాంగ్రెస్ కౌంటర్ అటాక్‌కు రెడీ
- అసెంబ్లీ వేదికగా హాట్ పాలిటిక్స్
- విపక్షాల విమర్శలకు సర్కార్ కౌంటర్

**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వమే లక్ష్యంగా పోరుబాట పట్టేందుకు విపక్షాలు రెడీ అయ్యాయి. వెయ్యి రోజులైనా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో అధికార పార్టీ పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ఆందోళనలకు సిద్ధమవుతున్నది. ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిరాహార దీక్షలు చేయాలని బీజేపీ నిర్ణయించింది. అయితే రెండు పార్టీలూ సర్కారుపై దుష్ప్రచారం చేస్తున్నాయంటూ.. వాటిని తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ ప్రణాళికలు రచించింది. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి, హామీల అమలు, ప్రధాన సమస్యలపై వాస్తవాలను వివరించడానికి అసెంబ్లీ సమావేశాలను వినియోగించుకోవాలని భావిస్తున్నది.

వెయ్యి రోజుల పాలనపై..

సెప్టెంబర్ 2వ తేదీకి కాంగ్రెస్ పాలన వెయ్యి రోజులు పూర్తి చేసుకుంటున్నది.

మిగతాది 2 లో..

# రూ.500 కోట్ల భూమి.. రూ.87 కోట్లకేనా?

- అజామాబాద్ భూమిపై హరీశ్ రావు ఫైర్
- రేవంత్ సర్కార్‌పై సంచలన ఆరోపణలు
- 'ప్రైవేట్‌కు భూమి దారాదత్తం?'
- ఆయిల్‌ఫెడ్‌ను కాదని ప్రైవేట్‌కా?
- ప్రభుత్వ భూములపై 'రియల్ ఎస్టేట్ దందా'?
- కేటాయింపు రద్దు చేయాలన్న హరీశ్



**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ అజామాబాద్‌లో సుమారు రూ.500 కోట్ల విలువైన ప్రభుత్వ తెలంగాణ ఆయిల్‌ఫెడ్ భూమిని ప్రైవేట్ వ్యక్తులకు దారాదత్తం చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాజీ మంత్రి, బీఆర్ఎస్ శాసనసభాపక్ష ఉపనేత హరీశ్ రావు బహిరంగ లేఖ రాశారు. దశాబ్దాలుగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న ఆస్తులను కమీషన్ల కోసం ప్రైవేటుపరం చేయడంపై ఆయన తీవ్ర స్థాయిలో మండిపడ్డారు.

2 లో

# తెలంగాణ కేబినెట్‌లో భారీ మార్పులు!



**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** తెలంగాణ అధికార కాంగ్రెస్ పార్టీలో రాజకీయం మరింత వేడెక్కింది. ఓవైపు మంత్రి కొండా సురేఖ వ్యవహారం అధిష్ఠానం వద్దకు చేరడం, అధికారంలోకి వచ్చి రెండున్నరేళ్లు పూర్తవుతున్న నేపథ్యంలో క్యాబినెట్ విస్తరణ అంశం మరోసారి తెరపైకి వచ్చింది.

2 లో

# తెలంగాణకు 3 బుల్లెట్ రైళ్లు..

- కిషన్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు!
- తెలంగాణలో రైల్వేలకు మహర్దశ!
- రూ.11 వేల కోట్లతో 42 స్టేషన్లు
- వికారాబాద్ స్టేషన్‌కు రూ.27 కోట్లు
- ఏడాది చివరికల్లా పనులు పూర్తి
- కవచ్ టెక్నాలజీతో రైలు భద్రత
- బుల్లెట్ రైలుతో ట్రాఫిక్‌కు చెక్!



**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** తెలంగాణలో 11 వేల కోట్లతో 42 రైల్వే స్టేషన్లను ఆధునీకరించి ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. ఆదివారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణ పనులను కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్టేషన్ అభివృద్ధి పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకుని ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించేలా పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు.

ఈ సందర్భంగా కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మాట్లాడుతూ..

2 లో

# స్కూళ్లలో కొత్త రూల్!




- క్రాస్ వాల్యుయేషన్‌తో పక్షపాతానికి చెక్
- వేరే స్కూల్ టీచర్లతో మూల్యాంకనం
- 1 నుంచి 10వ తరగతి వరకు అమలు
- మండల కేంద్రాల్లో ప్రత్యేక కేంద్రాలు
- ఎంఈఓల పర్యవేక్షణలో మూల్యాంకనం
- విద్యార్థుల అసలైన ప్రతిభకు గుర్తింపు
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక ఫోకస్

# రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి?



- రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ
- రాజకీయ సమీకరణాలతో ఆలస్యమైందన్న మహేష్ గౌడ్
- సెప్టెంబర్‌లోనే సమస్యలకు పరిష్కారం
- కేబినెట్ విస్తరణపై పెరిగిన ఉత్కంఠ
- కాంగ్రెస్‌లో అసంతృప్తులపై కీలక వ్యాఖ్యలు
- కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంపై క్లారిటీ
- నేతల మధ్య సమన్వయమే లక్ష్యమన్న టీపీసీసీ చీఫ్

# 30 ఏళ్ల కల సాకారం

- వెలిగొండ ఫేజ్-1కు సీఎం శ్రీకారం
- కరవు నేలకు కృష్ణమ్మ జలాలు!
- మూడు దశాబ్దాల నిరీక్షణకు తెర
- నేడు వెలిగొండకు చంద్రబాబు జలహారతి
- 10.70 టీఎంసీల కృష్ణా జలాలు
- తొలి దశతో 1.19 లక్షల ఎకరాలకు నీరు
- 4 లక్షల మందికి తాగునీరు



**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** సీఎం నారా చంద్రబాబు నాయుడు సోమవారం మార్కాపురం జిల్లాలో పర్యటించనున్నారు. దశాబ్దాలుగా తీవ్ర కరువును ఎదుర్కొంటున్న మార్కాపురం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి ప్రారంభించి, నీటిని విడుదల చేయనున్నారు. వెలిగొండ ప్రాజెక్టుతో మార్కాపురం ప్రాంతంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడప జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు కొత్త జీవం లభించనుంది. ముఖ్యంగా 30 ఏళ్ల క్రితం, 1996 మార్చి 5న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు, మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టు తొలి దశను స్వయంగా ప్రారంభించడం చారిత్రక ఘట్టంగా నిలవనుంది. 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తోంది.

కరవు నేలకు కృష్ణమ్మ జలాలు..

తీవ్ర వర్షాభావం, అడుగంటిన భూగర్భ జలాలు, ఫ్లోరైడ్ సమస్యలు, సాగునీటి కొరతతో దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతానికి వెలిగొండ కేవలం ఒక ఇరిగేషన్ ప్రాజెక్టు మాత్రమే కాదు...

# మోదీకి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు!

- మోదీకి ఉజ్బెకిస్థాన్ అత్యున్నత పురస్కారం
- 'దోస్ట్ లిక్' మెడల్ ప్రదానం
- 36వ అంతర్జాతీయ అవార్డుగా గుర్తింపు
- ఇరుదేశాల శాశ్వత బంధానికి అంకితం
- 140 కోట్ల భారతీయులకు గౌరవమన్న మోదీ
- ఇండోనేషియాలోనూ అత్యున్నత పురస్కారం
- స్లోవేకియా, సీషెల్స్ నుంచి అరుదైన గౌరవాలు
- ఘనా, నార్వే, స్వీడన్, ఇజ్రాయెల్ పురస్కారాలు

2 లో

# పబ్లిసిటీ కోసమే ఆరోపణలు

- విజయసాయి వ్యాఖ్యలపై సజ్జల ఫైర్
- జగన్‌పై ఆరోపణలు చేయడం సరికాదన్న నేత
- పబ్లిసిటీ కోసమే కొత్త వ్యాఖ్యలంటూ విమర్శ
- వైసీపీ నుంచి వెళ్లిన వారిపై స్పందించలేదన్న సజ్జల
- విజయసాయి రాజకీయ పార్టీపై ఆసక్తికర వ్యాఖ్యలు
- స్థానిక ఎన్నికలకు వైసీపీ సిద్ధమన్న ప్రకటన
- జగన్‌నే టార్గెట్ చేస్తున్నారంటూ ఆరోపణ




**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** సొంత కారణాలతోనే మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీ నుంచి బయటకు వెళ్లారని వైసీపీ స్టేట్ కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి అన్నారు. వైసీపీని వీడిన వారిపై తాము ఎప్పుడూ పెద్దగా విమర్శలు చేయలేదని.. 40 ఏళ్లుగా వైఎస్ జగన్ వెంట ఉన్న వ్యక్తి ఆరోపణలు చేయడం సరికాదన్నారు. పార్టీ నుంచి వెళ్లిన వారి గురించి జగన్ ఎప్పుడూ నెగెటివ్‌గా మాట్లాడలేదని, జగన్ మతమార్పిడులను ప్రోత్సహించారని సాయిరెడ్డి అనడం దారుణం అని ఫైర్ అయ్యాడు. విజయసాయి రెడ్డి పబ్లిసిటీ కోసం ప్రయత్నిస్తున్నారు అని సజ్జల చెప్పుకొచ్చారు.

'కాంగ్రెస్ పార్టీతో ములాఖత్ అయిన టీడీపీ.. వైఎస్ జగన్ వ్యక్తిత్వాన్ని టార్గెట్ చేసింది. జగన్ అన్ని వర్గాల మనసులు గెలుచుకుని అధికారాన్ని తీసుకువచ్చారు. ఐదేళ్లలో 15 ఏళ్ల స్థాయి అభివృద్ధి చేశారు.

# చేయూత పింఛన్‌కు నేడే డెడ్‌లైన్!

- చేయూత పింఛన్ దరఖాస్తులకు నేటితో గడువు
- కొత్తగా లక్షల మందికి పింఛన్లు
- వితంతువులు, దివ్యాంగులకు ప్రాధాన్యత
- దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తులకు ప్రత్యేక అవకాశం
- పాత దరఖాస్తుదారులకు మళ్లీ అవసరం లేదు
- గ్రామ, వార్డు కార్యాలయాల్లో దరఖాస్తులు
- ఆధార్, రేషన్, బ్యాంక్ పత్రాలు తప్పనిసరి

# తెలంగాణ అసెంబ్లీకి ముహూర్తం ఫిక్స్!

- సెప్టెంబర్ 7 నుంచి అసెంబ్లీ సమావేశాలు
- ఉదయం 10 గంటలకు సభల ప్రారంభం
- ఎమ్మెల్యేలకు ప్రశ్నలు ఇవ్వాలని సూచన
- ప్రశ్నలకు మంత్రులు సమాధానాలు
- సమావేశాల తేదీలపై బీఏసీ నిర్ణయం
- 22ఏపై సభలో వాడివేడి చర్చ
- కృష్ణా, గోదావరి జలాలపై చర్చకు అవకాశం

2 లో

# రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి?

**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** తెలంగాణ కాంగ్రెస్ పార్టీలో అంతర్గత పరిణామాలు, నేతల అసంతృప్తులపై తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఓ మీడియా ప్రతినిధితో జరిగిన చిట్‌చాట్‌లో ఆయన పార్టీలోని ప్రస్తుత పరిస్థితులు, నేతల మధ్య ఉన్న అసంతృప్తులు, మంత్రివర్గ విస్తరణపై స్పష్టత ఇచ్చారు. ఈ సందర్భంగా మహేష్ గౌడ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ అనేది ఒక మహా సముద్రం లాంటిదని, ఇక్కడ నేతలకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఎక్కువగా ఉంటుందని వ్యాఖ్యానించారు. దాంతో పాటు క్రమశిక్షణ కూడా ముఖ్యమే అన్నారు. పార్టీలో క్రమశిక్షణ తప్పకుండా చూసుకుంటామని చెబుతూ.. కొండా సురేఖ, చిన్నారెడ్డి వ్యవహారంలో పార్టీపరంగా చేయాల్సింది పార్టీ అధిష్ఠానం చేస్తోందని స్పష్టం చేశారు.

**రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి హామీ..**

మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని అంగీకరించారు. అయితే, కొన్ని రాజకీయ సమీకరణాల వల్ల అనుకున్న సమయానికి ఇవ్వలేకపోయామని, రాజకీయాల్లో ఓపిక అవసరమని పేర్కొన్నారు. తెలంగాణ కాంగ్రెస్‌లో ఉన్న చిన్నపాటి సమస్యలు, నేతల అసంతృపులు, నామినేటెడ్ పదవుల భర్తీ వంటి అంశాలన్నింటికీ సెప్టెంబర్ నెలలోనే పూర్తి పరిష్కారం దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. పార్టీలోని విభేదాలను సరిదిద్ది, అందరినీ సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతామని టీపీసీసీ అధ్యక్షుడు తేల్చిచెప్పారు.

అయితే.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ వ్యాఖ్యలతో తెలంగాణ రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. కాంగ్రెస్‌లోని సమస్యలన్నింటికీ సెప్టెంబర్ నెలలోనే పరిష్కారం లభిస్తుందని, కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డికి మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చిన మాట వాస్తవమేనని ఆయన వ్యాఖ్యానించడంతో రాజకీయం ఆసక్తికరంగా మారింది. దీంతో రాబోయే సెప్టెంబర్‌లో కేబినెట్ విస్తరణ ఉంటుందా? రాజగోపాల్ రెడ్డికి మంత్రివర్గంలో చోటు దక్కబోతోందా? అనే తీవ్రమైన ఊహాగానాలు, రాజకీయ విశ్లేషణలు మొదలయ్యాయి.

# మోదీకి మరో ప్రతిష్ఠాత్మక అవార్డు!



**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** ప్రధాని నరేంద్ర మోడీ ప్రస్తుతం ఉజ్బెకిస్థాన్ పర్యటనలో ఉన్న విషయం తెలిసిందే. ఆయనకు ఆ దేశ ప్రెసిడెంట్ ప్రతిష్ఠాత్మక పురస్కారాన్ని అందించారు. ఉజ్బెకిస్థాన్ సుప్రీం స్టేట్ అవార్డును మోడీ అందుకున్నారు. ఓలియ్ దారాజలి డోస్ట్ లిక్ మెడల్ ను ప్రెసిడెంట్ శావ్కత్ ప్రదానం చేశారు. ప్రధాని నరేంద్రమోడీని వరించిన 36వ ఇంటర్నేషనల్ అవార్డు ఇదే కావడం విశేషం. ఈ పురస్కారం స్వీకరించడం గర్వంగా ఉందని, ఇరుదేశాల మధ్య శాశ్వత బంధానికి దానిని డెడికేట్ చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. ఇండియన్స్ కు బాగా తెలిసిన దోస్త్ అనే పదం మాదిరిగానే డోస్ట్ లిక్ అనే పదానికి అర్థం ఫ్రెండ్ షిప్ అని చెప్పారు.

ఈ ఏడాది జూలైలో ఇండోనేషియా పర్యటన సందర్భంగా ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారమైన బింటాంగ్ ఆదిపూర్ణను ప్రధాని మోదీకి బహుకరించారు. అంతకుముందు జూన్ 2026లో సీషెల్స్ పర్యటించిన సమయంలో పర్యావరణం, స్థిరమైన అభివృద్ధి రంగాలలో ఆయన కృషికి గాను గార్డియన్ ఆఫ్ ది బ్లూ హొరైజన్ అవార్డు లభించింది. అదే నెలలో స్లొవేకియాలో పర్యటించిన ఆయనకు ఆ దేశ అత్యున్నత రాష్ట్ర పురస్కారం ఆర్డర్ ఆఫ్ ది వైట్ డబుల్ క్రాస్ ను అందించి గౌరవించారు. వీటితో పాటు ఈ ఏడాది ఘనా, నార్వే, స్వీడన్, ఇజ్రాయెల్ దేశాలు కూడా ప్రధాని మోదీకి తమ అత్యున్నత పౌర, రాష్ట్ర పురస్కారాలను ప్రదానం చేశాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తనకు దక్కిన ఈ గౌరవం 140 కోట్ల మంది భారతీయులకు దక్కిన గౌరవంగా భావిస్తున్నానని తెలిపారు.


# రూ.500 కోట్ల భూమి.. రూ.87 కోట్లకేనా?

మొదటి పేజీ తరువాయి

లేఖలోని ముఖ్యంశాలు..

"కాంగ్రెస్ ప్రభుత్వం నగరం నడిబొడ్డులో మరో అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ప్రైవేటు వ్యక్తులకు దారాదత్తం చేస్తోంది. ప్రజా సంక్షేమాన్ని గాలికి వదిలేసిన రేవంత్ రెడ్డి సర్కార్.. రియల్ ఎస్టేట్ ఏజెన్సీగా మారిపోయింది. ఆర్టీసీ క్రాస్ రోడ్స్ అజామాబాద్‌లో ఉన్న రూ.500 కోట్ల విలువైన ఆయిల్‌ఫెడ్ భూమిని ప్రైవేట్ వ్యక్తుల పరం చేస్తున్న ప్రభుత్వం. బహిరంగ మార్కెట్లో 500 కోట్ల రూపాయలు పలికే భూమిని.. కేవలం 87 కోట్లకే ఓ ప్రైవేట్ వ్యక్తికి కట్టబెట్టే భారీ కుట్ర జరుగుతోంది. ఆ 87 కోట్లు చెల్లించడానికి సొంత ప్రభుత్వ సంస్థ ఆయిల్‌ఫెడ్ సిద్ధంగా ఉన్నా.. వారిని కాదని ప్రైవేట్ వ్యక్తికి అప్పగించడం వెనుక ఉన్న కుంభకోణం ఏంటి?. మూడు దశాబ్దాలుగా ఆయిల్‌ఫెడ్ ఆధీనంలో ఉన్న 3 ఎకరాల 23 గుంటల (15,984 గజాలు) భూమిని లాక్కునే దుర్మార్గం. 1987లో సుప్రీంకోర్టు ప్రైవేట్ సంస్థకు మొట్టికాయలు వేసి ప్రభుత్వానిదే హక్కు అని తేల్చినా.. కమీషన్ల కోసం కాంగ్రెస్ నేతలు తీర్పులనే తుంగలో తొక్కారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏనాడూ ప్రైవేట్ శక్తులకు తలొగ్గకుండా వందల కోట్ల ప్రభుత్వ ఆస్తిని చిత్తశుద్ధితో కాపాడాం. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే.. పేదల పొట్టగొట్టి పెద్దలకు పల్లీలు, బఠానీల్లా వేల కోట్ల భూముల పందేరం చేస్తున్నారు. ఒకవైపు సామాన్యుల ఇండ్లను 22ఏ జాబితాలో పెట్టి వేధింపులు.. మరోవైపు ఖరీదైన ప్రభుత్వ భూములను కమీషన్ల కోసం కారుచౌకగా ప్రైవేట్‌కు దారాదత్తం. ఇది ఒక్క అజామాబాద్ భూమి కథే కాదు.. కోకాపేట, రాయదుర్గం, గచ్చిబౌలిలోనూ కాంగ్రెస్ రియల్ ఎస్టేట్ దందానే నడుస్తోంది. ఇలా స్వార్థం కోసం ఇష్టారాజ్యంగా ఆస్తులు అమ్ముకుంటూ పోతే.. భవిష్యత్తులో గుడికి, బడికి, చివరికి స్మశానానికి కూడా రాష్ట్రంలో స్థలం మిగలదు. తక్షణమే ముఖ్యమంత్రి ఈ అక్రమ కేటాయింపును రద్దు చేసి, ఆ భూమిని ఆయిల్‌ఫెడ్‌కే దక్కేలా ఫ్రీహోల్డ్ హక్కులు కల్పించాలి. ప్రజల సొత్తును ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడితే బీఆర్ఎస్ చూస్తూ ఊరుకోదు.. ఈ నిర్ణయం వెనక్కి తీసుకునే వరకు మహా పోరాటం చేస్తాం" అని హరీశ్ రావు లేఖలో పేర్కొన్నారు.

# తెలంగాణ అసెంబ్లీకి ముహూర్తం ఫిక్స్!



**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** తెలంగాణ శాసనసభ, మండలి వర్షాకాల సమావేశాలకు ముహూర్తం ఖరారయింది. సెప్టెంబర్ 7వ తేదీ నుంచి అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కానున్నాయి. ఈ మేరకు శాసనసభ కార్యదర్శి అధికారిక సర్కులర్ జారీ చేశారు. 7వ తేదీ ఉదయం 10 గంటల నుంచి సభలు ప్రారంభమవుతాయని, శాసనసభ సభ్యులతో పాటు మండలి సభ్యులకు కూడా సమాచారాన్ని అందిస్తూ.. సర్క్యులర్ పంపారు.

వర్షాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రజా ప్రాముఖ్యత కలిగిన అంశాలపై ప్రశ్నలు ఇవ్వాలని ఎమ్మెల్యేలకు కార్యదర్శి సూచించారు. 2వ తేదీలోగా వాటిని అందించాలని తెలిపారు. రూల్ 39 ప్రకారం సభ్యులు అడిగే ప్రశ్నలకు సభలో మంత్రులు సమాధానమివ్వాల్సి ఉంటుంది. ముందస్తు ప్రశ్నలను సంబంధిత శాఖలకు పంపి.. తెలంగాణ ప్రభుత్వం సమాధానాలను సిద్ధం చేయనుంది.

సమావేశాలు ఎన్ని రోజుల నిర్వహించాలన్న అంశంపైన తొలి రోజు సభ ముగిసిన తర్వాత నిర్వహించే బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకోనున్నారు. ఈ సారి సభల్లో 22ఏ అంశం, కృష్ణా, గోదావరి జలాలు వినియోగం ఇంకా అనేక అంశాలు చర్చకు వచ్చే అవకాశాలున్నాయని అసెంబ్లీ వర్గాలు తెలిపాయి. ఢిల్లీలోని జంతర్ మంతర్ లో సీజేపీ ఆందోళన, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రదాన్ రాజీనామాల అనంతరం నెక్లస్ రోడ్ లో టీపీసీసీ ర్యాలీ నిర్వహించారు. ఆ ర్యాలీలో ప్రసంగించిన సీఎం రేవంత్ రెడ్డి యువత చట్ట సభలకు పోటీ చేసే వయసును 25 నుంచి 21ఏళ్లకు తగ్గించాలని, అసెంబ్లీలో తీర్మానం చేస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో ఇప్పుడు జరిగే అసెంబ్లీ సమావేశాల్లో ఈ తీర్మానం చేసే అవకాశాలున్నాయని అసెంబ్లీ వర్గాలు వెల్లడించాయి.

కాగా.. ఈ అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్ కూడా రావాలని సీఎం రేవంత్ రెడ్డి గతంలోనే కోరారు. ఈ సమావేశాల్లో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు, ఆర్థిక పరిస్థితి, సాగునీటి ప్రాజెక్టులు వంటి అంశాలపై లోతుగా చర్చించనున్నారు.

# తెలంగాణకు 3 బుల్లెట్ రైళ్లు..

మొదటి పేజీ తరువాయి

వికారాబాద్ రైల్వే స్టేషన్ ఆధునీకరణతో పాటు తెలంగాణలోనే 42 రైల్వే స్టేషన్‌లు ఏకకాలంలో అభివృద్ధి చేయడం జరుగుతుందన్నారు. ప్రధానమంత్రి ఆధ్వర్యంలో కవచ్ టెక్నాలజీ ద్వారా ప్రమాదాల నివారణకు దోహదపడుతుందన్నారు. బుల్లెట్ ట్రైన్ మన తెలంగాణకు వస్తే దేశంలోనే ప్రథమ స్థానంలో తెలంగాణ నిలుస్తుందన్నారు. బుల్లెట్ ట్రైన్ నడవడం ద్వారా ట్రాఫిక్ సమస్యలు పూర్తిగా నివారించవచ్చు అన్నారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ 27 కోట్లతో అభివృద్ధి పనులు చేయడం జరుగుతుందన్నారు. వికారాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రయాణికులు ఎటువంటి ఆటంకాలు లేకుండా సజావుగా ప్రయాణించగలుగుతారన్నారు.

వికారాబాద్ స్టేషన్ లో ఫోర్ విల్లర్ పార్కింకింగ్ 50కి పెంచడం జరిగిందన్నారు. టు వీలర్ పార్కింకింగ్ 150కి పెంచడం జరిగిందన్నారు. రైల్వే స్టేషన్ లో ప్రయాణికుల సౌకర్యార్థం ఎస్కలేటర్ 2 లిఫ్టులు క్యాంటీన్ దివ్యాంగులకు ఆధునిక వసతులు కల్పించడం జరుగుతుందన్నారు. ఈ సంవత్సరం చివరి వరకు రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందన్నారు. అండర్ బ్రిడ్జి సమస్యలు తొలగించడం కొరకు ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి తో కలిసి సెంట్రల్ రైల్వే మినిస్టర్ తో సమస్య పరిష్కరిస్తామన్నారు. అతి తక్కువ కాలంలోనే నేషనల్ హైవే పనులు కూడా పూర్తి చేస్తామన్నారు. ప్రయాణికులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. రైల్వే మౌలిక వసతుల అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణలో రైల్వే రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని అన్నారు.

వికారాబాద్ ప్రాంత అభివృద్ధికి రైల్వే కనెక్టివిటీ ఎంతో కీలకమని ఆధునీకరణ పనులు పూర్తయిన తర్వాత ప్రయాణికులకు మరింత సౌకర్యవంతమైన సేవలు అందుతాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి జిల్లా కలెక్టర్ దీపక్ తివారి రైల్వే డివిజనల్ మేనేజర్ సికింద్రాబాద్ ఆర్ గోపాలకృష్ణ అడిషనల్ ఎస్పీ రాజేష్ మీనా ఎమ్మెల్సీ అంజి రెడ్డి ఎమ్మెల్యే కాలే యాదయ్య బిజెపి రాష్ట్ర సెల్ కన్వీనర్ రాజశేఖర్ రెడ్డి జిల్లా బిజెపి అధ్యక్షులు మాజీ అధ్యక్షులు మాధవరెడ్డి వికారాబాద్ నియోజకవర్గ కోఆర్డినేటర్ వడ్ల నందు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పెద్దింటి నవీన్ కుమార్ ఎమ్మార్వో లక్ష్మీనారాయణ అధికారులు పాల్గొన్నారు.

# 30 ఏళ్ల కల సాకారం

మొదటి పేజీ తరువాయి

ఆ ప్రాంత భవిష్యత్తును మార్చే జీవనాధార ప్రాజెక్టు. శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలించి నల్లమలసాగర్‌లో నిల్వ చేసి, ప్రధాన కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 30 మండలాల ప్రజలకు ప్రయోజనం కలగనుంది. ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలతో సహా సుమారు 23 లక్షల మందికి తాగునీటి ప్రయోజనం చేకూరనుంది.

తొలిదశతో కొత్త అధ్యాయం..

తొలి దశ ప్రారంభం ద్వారా 10.70 టీఎంసీల కృష్ణా జలాలను నల్లమలసాగర్‌కు విడుదల చేయనున్నారు. తొలి విడతలో సుమారు 1.19 లక్షల ఎకరాలకు సాగునీరు, 4 లక్షల మందికి తాగునీరు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వెలిగొండ జలాలు అందుబాటులోకి రావడం ద్వారా వ్యవసాయ రంగంలో కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయి. సాగునీటి భద్రత పెరగడంతో పంటలపై అనిశ్చితి తగ్గి, పంటల వైవిధ్యీకరణకు అవకాశం ఏర్పడుతుంది. భూగర్భ జలాలపై ఒత్తిడి తగ్గడంతో పాటు ఉద్యానవనం, అగ్రో ప్రాసెసింగ్, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలు అభివృద్ధి చెందేందుకు అవకాశాలు పెరుగుతాయి. తద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు మెరుగుపడి, వలసలకు అడ్డుకట్ట పడనుంది.

30 ఏళ్ల ప్రయాణం... సంకల్పం నుంచి సాకారం వరకు..

1996లో శంకుస్థాపన చేసిన వెలిగొండ ప్రాజెక్టు ప్రయాణంలో ఎన్నో సాంకేతిక, ఆర్థిక, నిర్మాణపరమైన సవాళ్లు ఎదురయ్యాయి. సొరంగాల నిర్మాణం, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, భూసేకరణ, పునరావాసం వంటి క్లిష్టమైన అంశాలను అధిగమిస్తూ ప్రాజెక్టు పనులు ముందుకు సాగాయి. 2024లో కూటమి ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన అనంతరం వెలిగొండను అత్యంత ప్రాధాన్యతా ప్రాజెక్టుగా తీసుకుని పనులను వేగవంతం చేసింది.

టన్నెల్ పనులు, ఫీడర్ కాలువలు, హెడ్ రెగ్యులేటర్లు, ఇతర అనుబంధ నిర్మాణాలతో పాటు నిర్వాసిత కుటుంబాలకు పునరావాసం, పరిహారం చెల్లింపులపై ప్రత్యేక దృష్టి సారించింది. కేవలం 48 రోజుల వ్యవధిలో నిర్వాసిత కుటుంబాలకు రూ.768 కోట్ల మేర పరిహారం చెల్లింపులు జరపడం ద్వారా పనులకు వేగం తీసుకువచ్చింది. అంతేకాకుండా గెజిట్, జాబితాలో పేర్లు లేని వారికోసం మరో రూ.169 కోట్లు, 2019 తర్వాత 18 ఏళ్ల నిండిని వారికి రూ.2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. 'శంకుస్థాపన చేసింది చంద్రబాబు... ప్రారంభిస్తున్నదీ చంద్రబాబే' అన్న అరుదైన చారిత్రక ఘట్టానికి ఆగస్టు 31వ తేదీ వేదిక కానుంది. 30 ఏళ్ల క్రితం చేసిన సంకల్పం ఇప్పుడు సాకారమవుతుండటం మార్కాపురం ప్రాంత ప్రజల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

ముఖ్యమంత్రి పర్యటన షెడ్యూల్..

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సోమవారం ఉదయం 9.30 గంటలకు ఉండవల్లి నివాసం నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి, ఉదయం 10.15 గంటలకు మార్కాపురం జిల్లా దోర్నాల మండలం గంటవానిపల్లి హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడ ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులు ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతారు. ఉదయం 10.25 గంటలకు రోడ్డు మార్గంలో వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ వేదికకు చేరుకుంటారు. ఉదయం 10.35 గంటల నుంచి 11.20 గంటల వరకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి... వెలిగొండ ప్రాజెక్టు ఫేజ్--1ను ముఖ్యమంత్రి ప్రారంభిస్తారు.

వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభోత్సవ పైలాన్ ఆవిష్కరిస్తారు. అనంతరం ప్రాజెక్టు గేట్లను ప్రారంభించి వెలిగొండకు కృష్ణా జలాల విడుదల కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఉదయం 11.30 గంటలకు గంటవానిపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన బహిరంగ సభా ప్రాంగణానికి చేరుకుంటారు. అక్కడ ప్రజా వేదిక సభలో ముఖ్యమంత్రి ప్రసంగిస్తారు. సభ అనంతరం మధ్యాహ్నం 1.30 గంటలకు తిరుగు ప్రయాణమై మధ్యాహ్నం 2.15 గంటలకు ఉండవల్లి నివాసానికి చేరుకుంటారు.

# పబ్లిసిటీ కోసమే ఆరోపణలు

మొదటి పేజీ తరువాయి

అప్పటి నుంచి ఇప్పటివరకు జగన్‌పై మాటల దాడి ఆగలేదు. మనుషులు మారినా వాళ్ళ టార్గెట్ మాత్రం జగన్. చంద్రబాబు వాళ్ళ ముఠా రంగప్రవేశం చేయకుండా బయట వ్యక్తులను ప్రోత్సహిస్తారు. ఉభయతారకంలా పని గడిచి పోతుంది. ఇప్పటికీ రెస్పాండ్ కాకపోతే సాధారణ ప్రజలకు ఇది నిజమే ఏమో అనిపించే అవకాశం ఉంది. సీఎం చంద్రబాబు ఏ రోజు ప్రజల గురించి అవసరం లేదు. కొత్తగా పాత్రలోకి వచ్చింది విజయసాయిరెడ్డి. ఆయన వ్యక్తిగత కారణాల వల్ల సాయిరెడ్డి బయటకు వెళ్ళారు. ఇప్పుడు రాజకీయ పార్టీ పెడతా అంటున్నారు. జగన్ ఎక్కడికి వెళ్లినా వారి గురించి నెగెటివ్‌గా మాట్లాడలేదు, మేము మాట్లాడలేదు' అని సజ్జల అన్నారు.

'2024 ఎన్నికల్లో పెద్ద ఎదురుదెబ్బ పడ్డా నిలదొక్కుకున్నాం. స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉన్నాం. సీఎం చంద్రబాబు చేస్తున్న తప్పుడు పనులు అడ్డుకోవటానికి కోర్టుకు వెళ్ళాం. 44 లక్షల ఓటర్లను లిస్ట్ నుంచి తీసేసారు. లేని ఓటర్లతో ఎన్నికలకు ఎలా వెళ్తారు. మాకు ఎన్నికలంటే భయం లేదు. ఎలక్షన్ కమిషన్ క్లియర్ చేసిన తర్వాత ఎన్నికలకు సిద్ధం. జగన్ మత మార్పిడులు చేయించారు అని సాయిరెడ్డి మాట్లాడటం కరెక్ట్ కాదు. మార్చాలి అనుకుంటే ఈయనను మార్చేవారు కదా. ఇతర మతాలు అంటే వైఎస్ రాజశేఖర్ రెడ్డి, జగన్ కు గౌరవం. చంద్రబాబు అంటున్నారు అంటే అందరికీ తెలుసు.. జగన్ గురించి అన్నీ తెలిసి సాయిరెడ్డి ఎలా మాట్లాడుతారు. కేవలం అటెన్షన్ తన వైపు తిప్పుకోవడానికి ఇలా మాట్లాడుతున్నారు. ఆయనకు ఇలాంటి అవకాశం ఇవ్వకూడదు అని ఇప్పటివరకు మాట్లాడలేదు. ఇప్పటికీ రియాక్ట్ కావటం లేదు అని మళ్ళీ కొత్తగా ఇంకొక మెసేజ్ పెట్టారు. కోటరీ.. నంబర్ 1, నంబర్ 2 అంటూ బహిరంగ లేఖ రాశారు. మొత్తం నా గురించే పెట్టారు. క్రియాశీలకంగా ఉన్న వ్యక్తి అలాంటి వ్యాఖ్యలు చేస్తే పార్టీలో రాంగ్ ఇండికేషన్ పోతుంది అని మాట్లాడాల్సి వస్తుంది. నేను పదవుల గురించి ఎప్పుడూ పట్టించుకోలేదు.. పదవులు అంటే బాధ్యతగా భావించా. ఆయన కామెంట్స్ మీద అపోహలు వచ్చే అవకాశం ఉందని భావించే మాట్లాడుతున్నా. వైసీపీ ఆవిర్భావం నుంచి కర్త, కర్మ జగన్. తన తండ్రి ఆలోచనలు.. తన ఆలోచనల నుంచి వైసీపీ పుట్టింది. అడ్మినిస్ట్రేషన్ విత్ హ్యూమన్ టచ్. సమాజం అభివృద్ధి చెందటానికి అడుగులు వేశారు' అని సజ్జల క్లారిటీ ఇచ్చారు.

# చేయూత పింఛన్‌కు నేడే డెడ్‌లైన్!

**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** తెలంగాణలోని నిరుపేదలు, అణగారిన వర్గాలకు సామాజిక భద్రత కల్పించే లక్ష్యంతో ప్రభుత్వం చేపట్టిన 'చేయూత' పింఛన్ల పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు సమయం ముగిసింది. నూతన పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవడానికి ప్రభుత్వం నిర్ణయించిన తుది గడువు నేటి తో ముగియనుంది. ఇంకా దరఖాస్తు చేసుకోని అర్హులైన లబ్ధిదారులు వెంటనే తమ వివరాలను సమర్పించాలని అధికారులు హెచ్చరిస్తున్నారు.

రేపటితో ముగియనున్న గడువు.. అర్హులు వీరే.!

రాష్ట్రవ్యాప్తంగా కొత్తగా లక్షలాది మందికి విడతలవారీగా చేయూత పింఛన్లు అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో భాగంగా వితంతువులు, ఒంటరి మహిళలు, దివ్యాంగులు, చేనేత-గీత కార్మికులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితులు , తలసీమియా వంటి దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్న వారికి ప్రాధాన్యత ఇస్తున్నారు. అర్హత ఉన్నవారందరూ తమ ఆధారాలను వెంటనే సమర్పించాల్సి ఉంటుంది. అయితే గతంలోనే 'ప్రజా పాలన', గ్రామ సభల ద్వారా దరఖాస్తు చేసుకున్నవారు మళ్లీ కొత్తగా అప్లై చేయాల్సిన అవసరం లేదు.

దరఖాస్తు విధానం , అవసరమైన పత్రాలు

ఇంకా దరఖాస్తు చేయని అర్హులు సంబంధిత గ్రామ పంచాయతీ కార్యాలయం, వార్డు ఆఫీస్ లేదా మీసేవ కేంద్రాల ద్వారా దరఖాస్తు ఫారాలను పూర్తి చేసి సమర్పించవచ్చు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డ్, రేషన్ కార్డ్, బ్యాంక్ పాస్ బుక్ కాపీలతో పాటు వైకల్యం లేదా సంబంధిత అర్హత ధ్రువీకరణ పత్రాలను జత చేయాలి. గడువు ముగిసిన తర్వాత వచ్చిన దరఖాస్తులను పరిశీలించబోమని, కాబట్టి లబ్ధిదారులు ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకోవాలని అధికారులు సూచిస్తున్నారు.

# తెలంగాణ కేబినెట్‌లో భారీ మార్పులు!

మొదటి పేజీ తరువాయి

ఈ పరిణామాల నేపథ్యంలో సెప్టెంబర్ 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ఢిల్లీ వెళ్తున్నారని.. అధిష్టాం నుంచి వారికి పిలుపు వచ్చినట్టు కాంగ్రెస్ వర్గాల్లో జోరుగా ప్రచారం జరుగుతోంది. విదేశీ పర్యటనలో ఉన్న ఏఐసీసీ వ్యవహారాల ఇంచార్జి కేసీ వేణుగోపాల్ సెప్టెంబర్ 1న ఢిల్లీకి తిరిగి రానున్నారని, అనంతరం తెలంగాణ వ్యవహారాలపై దృష్టి సారించనున్నారని సమాచారం.

ఢిల్లీలో సెప్టెంబర్ 3న జరగనున్న చర్చల్లో కొండా సురేఖ వ్యవహారంతోపాటు క్యాబినెట్ పునర్వ్యవస్థీకరణపై కూడా కీలక నిర్ణయం తీసుకుంటారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మంత్రి కొండా సురేఖ వివాదానికి సంబంధించి ఇప్పటికే క్రమశిక్షణ కమిటీ నివేదిక ఏఐసీసీకి చేరింది. దీనిపై హైకమాండ్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. కానీ, సీఎం, డిప్యూటీ సీఎం, పీసీసీ అధ్యక్షులను ఢిల్లీకి రప్పించడం సురేఖపై చర్యలు తీసుకోవడానికేనా? లేక మొత్తంగా క్యాబినెట్‌లో మార్పులు, చేర్పులు, పార్టీ వ్యవహారాలపై సమగ్ర చర్చ కోసమా? అన్న చర్చ జరుగుతోంది.

క్యాబినెట్‌లోకి మహేశ్ గౌడ్?

ఒకవేళ మంత్రివర్గం నుంచి కొండా సురేఖను తప్పిస్తే ఆ స్థానాన్ని ఎవరితో భర్తీ చేయాలన్నది కూడా చర్చకు వచ్చే అవకాశం ఉందని అంటున్నారు. పునర్వ్యవస్థీకరణలో భాగంగా టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్‌ను క్యాబినెట్‌లోకి తీసుకోవాలన్న ప్రతిపాదనలు ముందు నుంచే ఉన్నాయి. కానీ, ఆయనకు మంత్రి పదవి ఇస్తే.. పీసీసీ అధ్యక్షుడిగా ఎవరికి అవకాశం ఇస్తారే అనే చర్చ కూడా పార్టీ వర్గాల్లో జరుగుతోంది. పీసీసీ అధ్యక్ష పదవి ఎస్టీ, బీసీల్లో ఒకరికి దక్కవచ్చని.. వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్‌ల పేర్లు పరిశీలనలో ఉన్నాయని తెలుస్తోంది. అంతేకాదు, ఇంకో మంత్రికి కూడా ఉద్వాసన ఉంటుందని, ఆ స్థానంలో మరొకరిని తీసుకుంటారనే ప్రచారంం కూడా ఉంది. ఇదే సమయంలో శాఖలను కూడా మార్చుతారని సమాచారం.

# స్కూళ్లలో కొత్త రూల్!

**న్యూస్ డెస్క్, 30 ఆగస్టు (బిఎన్ఎస్ న్యూస్):** తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యా ప్రమాణాలను సరిగ్గా అంచనా వేసేందుకు విద్యాశాఖ ఒక సంచలనాత్మక నిర్ణయం తీసుకుంది. ఇకపై స్కూళ్లలో జరిగే పరీక్షల జవాబు పత్రాలను ఆయా పాఠశాలల ఉపాధ్యాయులే దిద్దే పాత పద్ధతికి స్వస్తి పలకనున్నారు. మూల్యాంకన ప్రక్రియలో నిష్పక్షపాత వైఖరిని పెంపొందించడం, పారదర్శకతను పెంచడం , విద్యార్థుల నిజమైన ప్రతిభను గుర్తించడమే లక్ష్యంగా 'క్రాస్ వాల్యుయేషన్' విధానాన్ని అధికారికంగా అమలు చేయనున్నారు.

వేరే ఉపాధ్యాయులతో మూల్యాంకనం - పక్షపాతానికి చెక్

కొత్తగా రూపుదిద్దుకున్న ఈ నిర్ణయం ప్రకారం, 1 నుంచి 9వ తరగతి విద్యార్థులకు నిర్వహించే SA-1, SA-2 పరీక్షల జవాబు పత్రాలతో పాటు, 10వ తరగతి SA-1 పరీక్షల పేపర్లను సదరు పాఠశాల ఉపాధ్యాయులు మూల్యాంకనం చేయరు. వాటి స్థానంలో వేరే పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులతో జవాబు పత్రాలను దిద్దిస్తారు. సాధారణంగా తమ వద్ద చదివే విద్యార్థుల పేపర్లు దిద్దేటప్పుడు ఉపాధ్యాయుల వైపు నుంచి కొంత పక్షపాతం లేదా మార్కుల కేటాయింపులో హెచ్చుతగ్గులు ఉండే అవకాశం ఉంది. ఈ కొత్త విధానం ద్వారా అలాంటి పొరపాట్లకు అడ్డుకట్ట పడటమే కాకుండా, విద్యార్థి రాసిన సమాధానాలకు తగిన ప్రామాణిక మార్కులు మాత్రమే లభిస్తాయి.

మండల కేంద్రాల్లో ప్రత్యేక మూల్యాంకన కేంద్రాలు

ఈ క్రాస్ వాల్యుయేషన్ వ్యవస్థను క్షేత్రస్థాయిలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వహించేందుకు ప్రతి మండల కేంద్రంలో ప్రత్యేక వాల్యుయేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనున్నారు. మండల విద్యాశాఖాధికారుల పర్యవేక్షణలో పనిచేసే ఈ కేంద్రాలకు ఇతర పాఠశాలల ఉపాధ్యాయులను డ్యూటీపై కేటాయించి మూల్యాంకన ప్రక్రియను పూర్తి చేస్తారు.

విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది

ఈ నూతన విధానం వల్ల మూల్యాంకనంలో పారదర్శకత పెరగడంతో పాటు బోధన విషయంలో ఉపాధ్యాయులలోనూ మరింత జవాబుదారీతనం పెరుగుతుంది. అంతేకాకుండా, నిష్పక్షపాతంగా వచ్చే ఈ ఫలితాల ఆధారంగా ప్రతి విద్యార్థి యొక్క అసలైన విద్యా సామర్థ్యాలను, వారిలోని బలహీనతలను స్పష్టంగా గుర్తించవచ్చు. దానికి అనుగుణంగా వెనుకబడిన విద్యార్థులకు ప్రత్యేక బోధన, రెమెడియల్ తరగతులు నిర్వహించి వారిని చదువులో ముందుకు నడిపించేందుకు ఈ నిర్ణయం ఎంతగానో దోహదపడనుంది. మొత్తానికి తెలంగాణ ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాల నాణ్యతను పెంచే దిశగా విద్యాశాఖ తీసుకున్న ఈ నిర్ణయం ఒక మైలురాయిగా నిలవనుంది.

# తెలంగాణలో పొలిటికల్ హీట్

మొదటి పేజీ తరువాయి

ఈ నేపథ్యంలో వంద రోజుల్లో నెరవేరుస్తామన్న హామీలు వెయ్యి రోజులైనా అమలు చేయలేదనే నినాదంలో ప్రజల్లోకి వెళ్లేందుకు బీఆర్ఎస్ సిద్ధమవుతున్నది. వారం రోజుల పాటు కాంగ్రెస్ మోసంపై వినూత్న నిరసన కార్యక్రమాలు చేపట్టాలని నిర్ణయించింది. నెరవేరని హామీలపై ప్రజలను చైతన్యవంతం చేయాలని కార్యకర్తలకు పార్టీ పిలుపునిచ్చింది. వచ్చే నెల ఒకటో తేదీన తెలంగాణ భవన్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్ విడుదల చేయనున్నారు. రెండో తేదీ నుంచి వరుసగా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమాల విజయవంతంపై ఎక్కడికక్కడ సన్నాహక సమావేశాలు నిర్వహిస్తున్నారు. సెప్టెంబర్ 2న ఆరు గ్యారెంటీల వైఫల్యంపై నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, హామీల మోసాన్ని గుర్తుచేస్తూ భారీ ఫ్లెక్సీల ప్రదర్శన, ప్రజలకు బాకీ ఉన్న హామీలతో ఇంటింటికీ బాకీ కార్డులను పంపిణీ చేయనున్నారు. ఇలా సెప్టెంబర్ 10వ తేదీన ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసనలకు బీఆర్ఎస్ సంఘీభావంతో నిరసన కార్యక్రమాలను ముగించనున్నది.

బీజేపీ ఆందోళనలు..

రాష్ట్రంలో అధికారంలోకి రావడమే లక్ష్యంగా పావులు కదుపుతున్న బీజేపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలపై పోరుబాట పట్టేందుకు సిద్ధమైంది. ఇప్పటికే ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ఇటీవల పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు రెండు రోజుల పాటు దీక్ష చేశారు. వచ్చే నెల 5, 6 తేదీల్లో '22ఏ' నిషేధిత భూముల సమస్యపై బీజేఎల్పీ నేత మహేశ్వర్‌రెడ్డి రెండు రోజుల దీక్ష చేయాలని నిర్ణయించారు. ఆ తర్వాత 7న బీజేవైఎం ఆధ్వర్యంలో ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై మహా ధర్నా చేయనున్నారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేసేందుకు శనివారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలతో సమావేశమయ్యారు. కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో ఆదిలాబాద్ నుంచి హైదరాబాద్ యాత్ర త్వరలో నిర్వహించాలని నిర్ణయించారు. ఇలా సెప్టెంబర్‌లో వరుస కార్యక్రమాలను చేపట్టనున్నారు.

తిప్పికొట్టేందుకు రెడీ అవుతున్న కాంగ్రెస్

బీఆర్ఎస్, బీజేపీ ఆరోపణలను తిప్పికొట్టేందుకు కాంగ్రెస్ రెడీ అవుతున్నది. కేంద్రంలోని బీజేపీ పన్నెండేండ్ల పాలన, గత బీఆర్ఎస్ పదేండ్ల పాలనపై అసెంబ్లీలో చర్చిద్దామని ఇప్పటికే పలు బహిరంగసభలు, మీడియా సమావేశాల్లో సీఎం రేవంత్‌రెడ్డి సవాల్ చేశారు. దీనిపై విపక్షాల నుంచి సరైన స్పందన రాలేదని కాంగ్రెస్ ఆరోపిస్తున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వేటినీ నిలిపివేయలేదని, అదే సమయంలో కొత్త పథకాలను ప్రకటించి అమలు చేస్తున్నామని గుర్తుచేస్తున్నది. వీటిని సరిగా చెప్పుకోలేకపోతున్నామని స్వయంగా సీఎం రేవంత్ పలుమార్లు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ నెల 7 నుంచి ప్రారంభం కానున్న అసెంబ్లీ సమావేశాలు.. రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారే అవకాశాలు కనిపిస్తున్నాయి.

# సవాళ్లు చేసి ఆపై వెనకడుగు వేసే తోటకు సవాళ్ల కోసం మాట్లాడే అర్హత లేదు...

- ఆస్తులు అమ్ముకొనే రాజకీయం చేస్తున్నా...
- తప్పుడు ప్రచారాలు చేసే వారిపై న్యాయస్థానం లో తగిన బుద్ధి చెబుతాం...
- తోట హయాంలో కోరుమిల్లి లో పేదల ఇల్లు పడగొట్టినప్పుడు ఆయన బుద్ధి ఏమైంది...




మండపేట (బీఎన్ఎస్) ఆగస్టు :30

పుష్కరాల అభివృద్ధి పనుల పేరుతో ఇళ్లను తొలగించారంటూ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు చేస్తున్న ఆరోపణలను మండపేట ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు తీవ్రంగా ఖండించారు. మండపేట తెలుగుదేశంపార్టీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాజకీయాల్లోకి వచ్చి ఆస్తులు అమ్ముకుంటున్నానని తాను చెప్పిన మాటలను త్రిమూర్తులు ఎగతాళి చేయడం ఆయన నైజానికి నిదర్శనమని తెలిపారు.

సవాళ్లు చేసి వెనకడుగులు వేసే ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు కొత్త సవాళ్లు విసిరే అర్హత లేదన్నారుతాను మాత్రం చేసిన సవాల్ కు కట్టుబడి ఉంటానన్నారు. ఎమ్మెల్సీ తోట లా మాట తప్పే వ్యక్తిని కాదన్నారు. కోరుమిల్లి లో చేసినట్టు చేయకుండా లెక్కలు తేల్చుకునేందుకు తోట సిద్ధం కావాలన్నారు. ఆయన దృష్టిలో రాజకీయాలంటే వేల కోట్లు సంపాదించడమేనని, కానీ తాము ఆస్తులు అమ్ముకునే నిజాయితీ గల రాజకీయం చేస్తున్నామని, ఇది నూటికి నూరు పాళ్లు వాస్తవమని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. పెద్ద కాలువ వద్ద పది ఎకరాల భూమి లేదని త్రిమూర్తులు అంగీకరించడాన్ని ఎమ్మెల్యే అభినందించారు. అయితే ఆ భూమికి ఉన్న దారి గురించి ఎందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. అక్కడ 70, 80 ఏళ్ల క్రితం నుంచే 40 అడుగుల దారి ఉందన్న విషయం ఆయనకు కనిపించడం లేదా అని నిలదీశారు. ప్రస్తుతం ప్రభుత్వం స్వాధీనం చేసుకున్న స్థలానికి, తమ రైస్ మిల్లుకు మధ్య రెండు కాలువలు వెళ్తున్నాయనే వాస్తవాన్ని కూడా కావాలనే దాస్తున్నారని ఈ విషయాలపై ఆయన సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

ఆ ఓం సిటీ కి సంబంధించి రియల్ ఎస్టేట్ చేసిన భూమిని జింకల పార్కు పెడతాం, జగనన్న వీకర్ సెక్షన్ ఇళ్లు కడతామని చెప్పి 2 నుంచి 3 కోట్లు చేసే పొలాన్ని కోటి 10 లక్షలకి బలవంతంగా రైతులను బెదిరించి రిజిస్ట్రేషన్ చేయించుకుని చివరికి వాళ్ళకే 22 వేల రూపాయల చొప్పున గజం రేటు కట్టి అంటగట్టారు అంటే బాకీ ఉన్నప్పుడు ఒక ఎమ్మెల్యేగా మీరు సెటిల్ చేయాలి కదా అని తోట అనటం హాస్యస్పదంగా ఉందన్నారు. తాను సెటిల్మెంట్లకు వ్యతిరేకం అన్నారు. అయితే తాను మాట్లాడింది మళ్లీ ఇంకోసారి వినమని తోటకు సూచించారు. సరే మీరు అలా చెయ్యలేదు అనుకుందాం అలా చెయ్యనప్పుడు మాస్టర్ ప్లాన్ 5 సంవత్సరాలు అవ్వనివ్వకుండా ఎందుకు ఆపారో చెప్పలన్నారు. సాక్షాత్తు మున్సిపల్ శాఖామాత్యులు బొత్సా సత్యనారాయణ, కమిషనర్ ని ఆదేశించినా వచ్చే నెలలో కౌన్సిల్ లో పెడతానని తోట చెప్పిన విషయన్ని గుర్తు చేశారు. మాస్టర్ ప్లాన్ పెట్టిస్తే రైతులను బెదిరించటానికి అవకాశం ఉండదనే ఆ ఐదేళ్ళు మీరు మాస్టర్ ప్లాన్ పెట్టకుండా ఇటు మాస్టర్ ప్లాన్‌ను ఒక బూచి, రెండో పక్కన ఆ జగనన్న వీకర్ సెక్షన్ ఒక బూచి గా చూపించారా అని దుయ్యబట్టారు.

కాలవల వద్ద పుష్కరాలు వస్తాయా అని ప్రశ్నిస్తున్న త్రిమూర్తులు అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారని విమర్శించారు. గత పుష్కరాలకు 12 రోజులు వందలాది మంది భక్తులు పెద్ద కాలవలోనే పుణ్యస్నానాలు ఆచరించారనే వాస్తవాన్ని గుర్తించాలని అన్నారు. అంతేకాకుండా, అక్కడ ఖాళీ చేయించిన 14 కుటుంబాలకు ప్రత్యామ్నాయంగా ఆశ్రయం కల్పించన విషయం మీకు కనిపించటం లేదా అన్నారు. కాని తోట త్రిమూర్తులు కోరుమిల్లిలో 40, 50 ఏళ్ల క్రితం నుంచి నివసిస్తున్న పేదల డాబా ఇళ్లతో సహా 12 ఇళ్లను బుల్డోజర్లతో దారుణంగా తొలగించారని ఎమ్మెల్యే విమర్శించారు. 2018లో మీ అనుచరుడు మాజీ సర్పంచ్ సలాది వీరబాబు బసవరాజు చెరువు అభివృద్ధి పేరుతో ఇళ్లను తొలగించాలని తనను కోరినప్పుడు, సరైన నిధులు మరియు ప్రత్యామ్నాయ ప్రణాళిక లేకపోవడంతో తాను ఆ ప్రతిపాదనను తిరస్కరించానని ఎమ్మెల్యే గుర్తుచేశారు. కానీ 2022లో వైకాపా అధికారంలోకి వచ్చాక, తన అనుచరుడు మెప్పు కోసం ఆ పేదల ఇళ్లను నిర్దాక్షిణ్యంగా కూల్చివేశారని మండిపడ్డారు. ఇప్పటివరకు కోరుమిల్లి చెరువు వద్ద రూపాయి అభివృద్ధి పని కూడా చేయలేదని ఎమ్మెల్యే ధ్వజమెత్తారు. ఏడిద గ్రామంలో దాతల సహకారంతో 3 నుంచి 4 కోట్ల రూపాయలతో చెరువును మోడల్‌గా తీర్చిదిద్దే క్రమంలో 25 ఇళ్లకు ప్రత్యామ్నాయ స్థలాలు ఇచ్చి అభివృద్ధి చేశామని ఉదాహరణగా చెప్పారు. కోరుమిల్లిలో ఇళ్లు తొలగించినప్పుడు వాళ్ళు పేదవారు అని చెప్పి మీకు జ్ఞాపకం రాలేదా లేకపోతే వారేమన్నా అపర కోటేశ్వరులు అని చెప్పి భావించి మీరు తీసేశారా? సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఏదో ఒక కారణంతో అమాయక ప్రజలను రెచ్చగొడుతున్న మీ మాజీ కౌన్సిలర్ అయిన మీ పార్టీ అధ్యక్షుడు కోరుమిల్లి కూల్చివేతపై ఏ సమాధానం చెప్తాడని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులుకు సవాల్ చేసే అర్హత లేదని ఎమ్మెల్యే వేగుళ్ళ జోగేశ్వరరావు స్పష్టం చేశారు. పరస్పరం ఇళ్ళకు లేదా కార్యాలయాలకు వెళ్ళడం వల్ల శాంతిభద్రతల సమస్యలు తలెత్తుతాయని, చట్టాన్ని గౌరవించే రాజకీయ నాయకులకు ఆ విషయాలు తెలియవా అని ప్రశ్నించారు. ఆస్తుల విషయమై తాను అత్యంత స్పష్టమైన ప్రతిపాదన చేశానని తెలిపారు. తాను మాట్లాడింది మళ్లీ రెండవసారి కూడా వినమని తోటకు సూచించారు. 1994లో తోట త్రిమూర్తులు ఎమ్మెల్యే అయ్యేనాటికి ఉన్న ఆస్తులు, నేటి వారి ఆస్తుల వివరాలతో పాటు 2009లో తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి ఆస్తులు, నేటి తన ఆస్తుల వివరాలను తోటకు నచ్చిన ఒక న్యాయమూర్తి (జడ్జి), న్యాయవాది (ప్లీడర్) లేదా ఆడిటర్ కు ఇద్దామని ముందు చెప్పింది ఇదేనని మరోక్క సారి చెప్తూ అప్పుడు ఎవరి ఆస్తులు ఎన్ని అనేది తెల్చి వారు ప్రెస్ కి రిలీజ్ చేస్తారన్నారు. ప్రకటించిన వివరాల్లో ఏవైనా ఆస్తులను మీరు దాచిపెడితే, వాటిని ఆధారాలతో సహా నిరూపించి మేము చూపించినప్పుడు ఆ ఆస్తిని తనకు రాసిద్దురుగాని అని తేల్చి చెప్పారు. రాజకీయాల్లో మాట నిలకడ, నైతిక విలువలు ముఖ్యమని ఎమ్మెల్యే గుర్తుచేశారు. గతంలో కోరుమిల్లి గ్రామంలో మాట్లాడుతూ "జోగేశ్వరరావుకు ఒక్క ఓటు మెజారిటీ వచ్చినా తాను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటాను" అని తోట త్రిమూర్తులు ఛాలెంజ్ చేశారని, కానీ ఎన్నికల ఫలితాల తర్వాత ఆ మాటను విస్మరించారని విమర్శించారు. ఇచ్చిన మాటకే కట్టుబడి ఉండని వారికి ప్రజాక్షేత్రంలో సవాళ్ళు విసిరే నైతిక హక్కు లేదని వ్యాఖ్యానించారు.

అదే విధంగా ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు మరో ప్రశ్నకు సమాధానం చెప్పాలని కోరుతున్నట్లు చెప్పారు. సాక్ష్యాత్తు వైసీపీ ప్రభుత్వ హయాంలోనే ఆయన ప్రధాన అనుచరుడు సయ్యద్ రబ్బాని కి వైసీపీ ప్రభుత్వం 10 కోట్ల రూపాయల జరిమాన ఎందుకు విధించిందో కారణం చెప్పాలన్నారు. అదే విధంగా ఆ తరువాత రబ్బానీ తన కోఆప్షన్ పదవికి రాజీనామా ఎందుకు చేశారో దానికి కూడా సమాధానం చెప్పాలని తోటను డిమాండ్ చేశారు.

## తిరుమల తరహాలో వాడపల్లి దివ్యక్షేత్రం అభివృద్ధి...

వాడపల్లి (బీఎన్ఎస్) ఆగస్టు :30

కోనసీమ తిరుమలగా పేరుగాంచిన వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్యక్షేత్రాన్ని తిరుమల తరహాలో అభివృద్ధి చేసేందుకు కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి, నరసాపురం ఎంపీ భూపతిరాజు శ్రీనివాస వర్మ, తెలిపారు. వాడపల్లి క్షేత్రాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేసేందుకు ప్రణాళికలు రూపొందుతున్నాయని వెల్లడించారు.



వాడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయంలో రూ.6.25 కోట్ల సీజీఎఫ్ (కామన్ గుడ్ ఫండ్) నిధులతో నిర్మించిన నూతన వకుళమాత అన్నదాన భవనాన్ని ఆదివారం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ మాట్లాడుతూ వాడపల్లి ఆలయం ఒక్క కోనసీమ ప్రాంతానికే పరిమితమైన క్షేత్రం కాదని, దేశవ్యాప్తంగా భక్తులను ఆకర్షిస్తున్న ప్రముఖ పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చెందుతోందన్నారు. భక్తుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో ఆలయంలో మరిన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు.

అన్నదానం అన్ని దానాలకంటే గొప్పదని, స్వామివారి దర్శనానికి వచ్చే ఏ భక్తుడూ ఆకలితో వెళ్లకూడదనే ఉద్దేశంతో ఇంత భారీ స్థాయిలో అన్నదాన భవనాన్ని నిర్మించడం అభినందనీయమన్నారు. నూతన భవనంలో ఒకేసారి సుమారు 2,000 నుంచి 2,500 మంది భక్తులు భోజనం చేసే సౌకర్యం ఉందని తెలిపారు. ఆధునిక వంట పరికరాలతో రోజుకు సుమారు 40 వేల మందికి ప్రసాదం సిద్ధం చేసే సామర్థ్యం కల్పించారని పేర్కొన్నారు.

వాడపల్లి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక శాఖ పరిధిలోని 'ప్రసాద్' (గ్రా=ూాూాణ) స్కీమ్ ద్వారా నిధులు తీసుకొచ్చేందుకు కృషి చేస్తానని శ్రీనివాస వర్మ హామీ ఇచ్చారు. ఈ విషయంపై కేంద్ర పర్యాటక శాఖ మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి వాడపల్లి ఆలయానికి నిధులు మంజూరు చేయించేలా చర్యలు తీసుకుంటానన్నారు. అలాగే ఆలయ అభివృద్ధికి కామన్ గుడ్ ఫండ్, టీటీడీ నుంచి కూడా నిధులు సమకూర్చేందుకు ప్రయత్నిస్తానని తెలిపారు.

దేవుడికి మనం దానం చేస్తున్నామనే భావన కాకుండా, మనకు లభించిన సంపదలో కొంత భాగాన్ని భగవంతుడికి సమర్పించుకునే అవకాశం కల్పించడం కూడా ఆయన అనుగ్రహమేనని శ్రీనివాస వర్మ పేర్కొన్నారు.

## పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలి.

### అఖిల భారత విద్యార్థి బ్లాక్ రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్.




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 29:

రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్బి రాష్ట్ర అధ్యక్షులు సగిలి రాజేంద్ర ప్రసాద్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం మధ్యాహ్నం కడప నగరంలోని ఓం శాంతి నగర్ లో గల ఏ.ఐ.ఎస్.బి కార్యాలయంలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా పెండింగ్ లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. విద్యా సంవత్సరం పూర్తయిన విద్యార్థులు తమ సర్టిఫికెట్ల కోసం విద్యాసంస్థలకు వెళితే విద్యార్థుల యొక్క ఫీజు బకాయిలు ఉన్నాయని నేపంతో కళాశాల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని దీంతో విద్యార్థుల చదువులు మధ్యలోనే అర్ధాంతరంగా ఆగిపోయే ప్రమాదం ఉందని వారు అన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపుగా 7000 కోట్ల రూపాయలు ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో ఉన్నాయని వాటి విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం సిగ్గుచేటని వారు అన్నారు. ప్రతి ఏటా ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పెండింగ్లో పడుతున్నాయని కావున విద్యార్థులే ఫీజులు చెల్లించాలని కళాశాల యాజమాన్యాలు విద్యార్థులపై ఒత్తిడి తెస్తున్నాయని వారు అన్నారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల కాకపోవడంతో కళాశాల నిర్వహణ, అధ్యాపకుల జీతాలు సమయానికి చెల్లించలేకపోతున్నామని కళాశాల యాజమాన్యాలు వాపోతున్నాయని వారు తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు పూర్తిస్థాయిలో విడుదల చేయాలని వారు డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏ.ఐ.ఎస్.బి నాయకులు అఖిల్, జీవన్ లు పాల్గొన్నారు.

## బొమ్మిరెడ్డి రమణారెడ్డి ను పరామర్శించిన నేదురుమల్లి

నెల్లూరు జిల్లా రాపూరు (బి.యన్.యస్):-నెల్లూరు జిల్లా రాపూరు మండలం రాపూరు పంచాయతీ పరిధిలోని సైదాదుపల్లి గ్రామానికి చెందిన వైఎస్ఆర్సిపి నాయకులు బొమ్మిరెడ్డి రమణారెడ్డి ఇటీవల అనారోగ్యంతో సర్జరీ చేయించుకుని, తన నివాసంలో విశ్రాంతి తీసుకుంటున్నారు. విషయం తెలుసుకున్న వెంకటగిరి నియోజకవర్గ వైఎస్ఆర్సిపి సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి ఆయనని పరామర్శించి ప్రస్తుత ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని, త్వరగా కోలుకోవాలని ఆకాక్షించారు. ఆయన వెంట రాపూర్ మండలం వైఎస్ఆర్సిపి నాయకులు బత్తిన పట్టాభిరామిరెడ్డి, నెల్లూరు జిల్లా వైస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీ దందోలు లక్ష్మీ నారాయణరెడ్డి కార్యకర్తలు ఉన్నారు.




## రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించిన మంత్రి సుభాష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి

రాజమండ్రి (బీఎన్ఎస్)ఆగస్టు :30

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పేర్కొన్నారు. అదివారం రాజమహేంద్రవరం రూరల్ ఏరియా కడియం మండలం మాధవ రాయుడుపాలెం గ్రామంలో రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డును రాజమండ్రి రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరితో కలిసి మంత్రి వాసంశెట్టి సుభాష్ ఘనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సుభాష్ మాట్లాడుతూ గ్రామాల్లో మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడం ద్వారా ప్రజల రాకపోకలు సులభతరం అవుతాయని అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని పేర్కొన్నారు. ప్రజలకు అవసరమైన ప్రతి అభివృద్ధి పనిని దశలవారీగా పూర్తి చేస్తూ గ్రామాలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతున్నామని తెలిపారు.

ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి మాట్లాడుతూ గ్రామీణ రహదారుల అభివృద్ధి వల్ల ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని, ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు విశేష ఆదరణ చూపుతున్నారని అన్నారు.



# ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యం.!!

## జిల్లా ఎస్పీ నచ్చికేత్ ఆదేశాల మేరకు జమ్మలమడుగు లో మెగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 30:

కడపజిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణ, నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయడమే లక్ష్యంగా జమ్మలమడుగు పట్టణంలో పెద్ద ఎత్తున కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. సబ్ డివిజన్ లోని పోలీస్ అధికారులు, సిబ్బంది పట్టణంలోని పలు ప్రాంతాలలో అణువణువునా శోధించారు. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, ఐపిఎస్ ఆదేశాల మేరకు, జమ్మలమడుగు సబ్ డివిజన్ పోలీసు అధికారి కె. వెంకటేశ్వరరావు, డీఎస్పీ నేతృత్వంలో, జమ్మలమడుగు అర్బన్ ఇన్‌స్పెక్టర్ నరేష్ బాబు ఆధ్వర్యంలో పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా పోలీసులు అనుమానాస్పద వ్యక్తులు, నేర చరిత్ర కలిగిన వ్యక్తులు, 8 మంది రౌడీషీటర్లు మరియు పాత నేరస్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి తనిఖీలు నిర్వహించారు. ఇళ్లలో తనిఖీలు చేపట్టడంతో పాటు 60 ద్విచక్ర వాహనాల పత్రాలు పరిశీలించి, వాటిలో 25 ద్విచక్ర వాహనాలు మరియు 3 ఆటోలకు సరైన ధ్రువపత్రాలు లేని వాహనాల వివరాలను నమోదు చేశారు. అలాగే అసాంఘిక కార్యకలాపాలు, చోరీలు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ కార్యకలాపాలు తదితర నేరాల నియంత్రణలో భాగంగా పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఇందులో నలుగురి అనుమానితులను పరికరం ద్వారా చెక్ చేయగా, వారికి నెగెటివ్ గా నిర్ధారణ జరిగింది. మహిళా భద్రత పై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి శక్తి యాప్ వినియోగం వల్ల కలిగే ప్రయోజనాల వివరిస్తూ పలువురి మొబైల్ ఫోన్లలో 220 శక్తి యాప్ డౌన్లోడ్ చేయించారు. ఈ సందర్భంగా జమ్మలమడుగు అర్బన్ సి.ఐ నరేష్ బాబు మాట్లాడుతూ.. ప్రజల భద్రతకు భంగం కలిగించే ఎటువంటి అసాంఘిక కార్యకలాపాలను ఉపేక్షించబోమని తెలిపారు. ప్రజలు తమ పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తులు లేదా కార్యకలాపాలు గమనించినట్లయితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. జమ్మలమడుగు పట్టణంలో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణలో భాగంగా రానున్న రోజుల్లో ఇలాంటి కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు నిరంతరం కొనసాగుతాయని ప్రజల సమక్షంలో పోలీసులు స్పష్టం చేస్తూ. ప్రజల భద్రతే పోలీసుల ప్రధాన లక్ష్యమని తెలిపారు.

# ముత్తరాయపల్లి ప్రజలతో మమేకమైన మైదుకూరు పోలీసులు

## మహిళల భద్రత, ట్రాఫిక్ నిబంధనలు, సైబర్ భద్రతపై అవగాహన



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 30:

జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్ ఐపిఎస్ ఆదేశాల మేరకు, మైదుకూరు డిఎస్పీ జి. రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో మైదుకూరు పిఎస్ ఎస్ఐ. వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీస్ స్టేషన్ పరిధిలోని ముత్తరాయపల్లి గ్రామాన్ని సందర్శించి స్థానిక ప్రజలతో సమావేశమై మహిళల భద్రత, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నిబంధనలు మరియు సైబర్ భద్రతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు, బాలికల భద్రతకు సంబంధించిన పలు అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మహిళలు ఎటువంటి వేధింపులు లేదా ఇబ్బందులు ఎదుర్కొన్నా ధైర్యంగా పోలీసులను సంప్రదించాలని, అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా, రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగానికి పాల్పడకుండా జాగ్రత్తగా ప్రయాణించాలని సూచించారు. సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తూ, గుర్తుతెలియని వ్యక్తుల ఫోన్ కాల్స్, సందేశాలు, అనుమానాస్పద లింకులు, నకిలీ వెబ్‌సైట్ల పట్ల జాగ్రత్త వహించాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం పిన్, ఓటీపీ, పాస్‌వర్డ్ వంటి వ్యక్తిగత సమాచారాన్ని ఇతరులతో పంచుకోవద్దని అవగాహన కల్పించారు. ప్రజలు పోలీసు శాఖతో సమన్వయంతో వ్యవహరిస్తూ, గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు పోలీస్ స్టేషన్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రజా అవసరాలకే ప్రాధాన్యం.. అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం.!

## రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇంచార్జ్ యల్లటూరి శ్రీనివాసరాజు.

## 25 లక్షల డీఎంఎఫ్ నిధులతో మన్నూరులో సిమెంట్ రోడ్డు నిర్మాణం ప్రారంభం



బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 30:

రాజంపేట పట్టణంలోని మన్నూరు ప్రాంతంలో యల్లమ్మ గుడి సమీపంలో డీఎంఎఫ్ నిధులు రూ.25 లక్షల వ్యయంతో నిర్మించనున్న నూతన సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను రాజంపేట పార్లమెంట్ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ యల్లటూరు శ్రీనివాసరాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను నిరంతరం కొనసాగిస్తోందన్నారు. ప్రజల అవసరాలను గుర్తించి రహదారులు, డ్రైనేజీ, తాగునీరు తదితర మౌలిక వసతులను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. మన్నూరు ప్రాంత ప్రజల చిరకాల అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని రూ.25 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడం సంతోషకరమన్నారు. నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సంబంధిత అధికారులను కోరారు. కూటమి ప్రభుత్వం సుదీర్ఘకాలం కొనసాగితే ఆంధ్రప్రదేశ్‌ను మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లి దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దగలమని శ్రీనివాసరాజు ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు, జనసైనికులు, అధికారులు, స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# పాలకుర్తిలో ఘనంగా భక్తాంజనేయ స్వామి ఆలయ గర్భగుడి సింహద్వార ప్రతిష్ఠాపన

బిఎన్ఎస్ న్యూస్ పాలకుర్తి ఆగస్టు 30

పాలకుర్తి మండల కేంద్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయ నిర్మాణ పనుల్లో భాగంగా గర్భగుడి సింహద్వార ప్రతిష్ఠాపన కార్యక్రమం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. భక్తులు, దాతలు, ప్రజల కోలాహలం, వేద పండితుల మంత్రోచ్ఛరణలు, మామిడి తోరణాలు, రంగురంగుల పూల అలంకరణలు, భజన సంకీర్తనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. పాలకుర్తి సర్పంచ్ కమ్మగాని విజయనాగన్న, సింహద్వారం, కిటికీల దాతలు గుడికందుల యాకన్న-సౌమ్య దంపతులు, ఆలయ పునరుద్ధరణ కమిటీ సభ్యుల చేతుల మీదుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ పూజారి గంగు నవీన్ శర్మ ఆధ్వర్యంలో వేద మంత్రోచ్ఛరణల నడుమ వేడుకలు జరిగాయి. అంతకుముందు స్వామివారికి ప్రత్యేక అభిషేకం నిర్వహించి, సింధూర లేపనం చేసి, తెల్ల జిల్లేడు పూలు, పూలమాలలు సమర్పించారు. అనంతరం నైవేద్యం సమర్పించి హారతి నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ.. దైవచింతన మనిషిని సన్మార్గంలో నడిపించడంతో పాటు మానసిక ప్రశాంతతకు దోహదపడుతుందని అన్నారు. ఆలయ పునఃప్రతిష్ఠలో భాగస్వాములు కావడం, సింహద్వారం ఎత్తే కార్యక్రమంలో పాల్గొనడం తమ పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నామని తెలిపారు. ఆలయ నిర్మాణ పనులు త్వరగా పూర్తయి భక్తులకు అందుబాటులోకి రావడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. దాతల సహకారంతో ఆలయ నిర్మాణ పనులను వేగంగా కొనసాగిస్తూ ఆదర్శంగా నిలుస్తున్న శ్రీ భక్తాంజనేయ స్వామి భక్త మండలి సభ్యులను వారు అభినందించారు. అనంతరం ఆలయ అర్చకులు అతిథులకు ఆశీర్వచనం అందించి ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కమ్మగాని సుధాకర్, సలేంద్ర రమసోమన్న, దాసరి అనూషమధు, రేపాల అశోక్, దేవసాని రాంబాబు, రాఘవులు (మేస్త్రి)తో పాటు ఆలయ దాతలు, భక్తులు, ప్రజలు పాల్గొన్నారు.

# పల్లెల ను సత్కరించిన శంభునిగూడెం సర్పంచ్ అర్వపల్లి

సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు30 బిఎన్ఎస్ న్యూస్: నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండల పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గా సత్తుపల్లి పట్టణం నుండి బదిలీపై విధులలో చేరిన పల్లెల ప్రదీప్ ను మండల పరిధిలోని



శంభునిగూడెం గ్రామ సర్పంచ్ అర్వపల్లి నరసింహారావు శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని ఎప్పుడు పూర్తి సహకారం అందిస్తామని అర్వపల్లి పల్లెల కు హామీ ఇచ్చారు.

# వెలిగొండ ప్రాజెక్ట్ ఫేజ్-1 ప్రారంభ పనుల్లో కడప జిల్లా అధ్యక్షుడు భూపేష్ రెడ్డి

## వెలిగొండ ప్రాజెక్ట్ ప్రారంభం వల్ల కడప జిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు కొత్త జీవం.

## 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' పేరుతో నేడు వేడుకగా కార్యక్రమం




బిఎన్ఎస్ న్యూస్ కడపజిల్లా ఆగస్టు 30: దశాబ్దాలుగా తీవ్ర కరువును ఎదుర్కొంటున్న మార్కాపురం జిల్లా ప్రజల చిరకాల స్వప్నమైన వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రారంభించి, నీటిని విడుదలలో వెలిగొండ ప్రాజెక్టుతో మార్కాపురం ప్రాంతంతో పాటు ప్రకాశం, నెల్లూరు, కడపజిల్లాల్లోని కరువు ప్రభావిత ప్రాంతాలకు కొత్త జీవం లభించనుంది. ముఖ్యంగా 30 ఏళ్ల క్రితం, 1996 మార్చి 5 న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రిగా వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసిన చంద్రబాబు నాయుడు మూడు దశాబ్దాల తర్వాత అదే ప్రాజెక్టు తొలి దశను స్వయంగా ప్రారంభించడం చారిత్రక ఘట్టంగా నిలువనున్న నేపథ్యంలో ఇక్కడి ఏర్పాట్లను మంత్రులు నిమ్మల రామానాయుడు, గొట్టిపాటి రవికుమార్, పార్థసారథి, చంద్రగిరి ఎమ్మెల్యే నాని, ఎర్రగుండి పాలెం ఇంచార్జ్ గూడూరు ఎరక్షన్ బాబు ఆధ్వర్యంలో కలిసి పరిశీలించే కార్యక్రమంలో పాల్గొని ఏర్పాట్లను పర్యవేక్షణలో నా భాగస్వామ్యం ఉన్నందున చాలా గర్వంగా ఉందని కడపజిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు భూపేష్ సుబ్బరామిరెడ్డి పేర్కొన్నారు. అలాగే 'వెలిగొండ జలసిరులు అభివృద్ధికి రెక్కలు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహిస్తోంది అన్నారు.

### కరవు నేలకు కృష్ణమ్మ జలాలు

తీవ్ర వర్షాభావం, అడుగంటిన భూగర్భ జలాలు, ఫ్లోరైడ్ సమస్యలు, సాగునీటి కొరతతో దశాబ్దాలుగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ ప్రాంతానికి వెలిగొండ కేవలం ఒక ఇరిగేషన్ ప్రాజెక్టు మాత్రమే కాదు.. ఆ ప్రాంత భవిష్యత్తును మార్చే జీవనాధార ప్రాజెక్టు అన్నారు. శ్రీశైలం జలాశయం నుంచి గ్రావిటీ ద్వారా కృష్ణా జలాలను తరలించి నల్లమలసాగర్‌లో నిల్వ చేసి, ప్రధాన కాలువల ద్వారా సాగు, తాగునీటి అవసరాలకు వినియోగించేలా ఈ ప్రాజెక్టును రూపొందించారు. వెలిగొండ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే 4.47 లక్షల ఎకరాలకు సాగునీరు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కడప జిల్లాలకు చెందిన 30 మండలాల ప్రజలకు ప్రయోజనం కలగనిందన్నారు ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలతో సహా సుమారు 23 లక్షల మందికి తాగునీటి ప్రయోజనం చేకూరనుంది అని తెలిపారు.

# నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

బిఎన్ఎస్ న్యూస్ పాలకుర్తి, ఆగస్టు 30



జనగామ జిల్లా పాలకుర్తి మండలం మల్లంపల్లి గ్రామానికి చెందిన మాజీ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గిరిగాని కుమారస్వామి-హేమలత దంపతుల ఏకైక కుమార్తె పియాంకా వివాహ వేడుక ఘనంగా జరిగింది. పాలకుర్తి మండల కేంద్రంలోని నూతన శ్రీ సోమేశ్వర స్వామి కళ్యాణ మండపంలో జరిగిన ఈ వివాహ వేడుకకు పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వధూవరులు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఆనందమయమైన దాంపత్య జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అనంతరం వధూవరుల కుటుంబ సభ్యులను ఆప్యాయంగా పలకరించి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోగు శ్రీనివాస్, ఏఎంసీ చైర్‌పర్సన్ మంజుల నాయక్, జిల్లా నాయకుడు మహ్మద్ మదార్, యూత్ అధ్యక్షుడు మాదాసు హరీష్, మండల నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పిఆర్టియు టీస్ జిల్లా నూతన కార్యవర్గంలో మరిపెడ మండల ఉపాధ్యాయులు

## జిల్లా ఉపాధ్యక్షుడిగా గుర్రం వెంకన్న గౌడ్ నియామకం

బిఎన్ఎస్ న్యూస్ మహబూబాబాద్ జిల్లా.







పిఆర్టీయూ టి ఎస్ మహబూబాబాద్ జిల్లా కమిటీలో మరిపెడ మండలంలోని ఉపాధ్యాయులకు చోటు దక్కినట్లు పిఆర్టీయూ మరిపెడ మండల అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు కీసర రమేష్ రెడ్డి, లింగాల మహేష్ గౌడ్ తెలిపారు. జిల్లా మహిళా అసోసియేట్ అధ్యక్షురాలుగా పి.సరోజ , జిల్లా ఉపాధ్యక్షులు గా గుర్రం వెంకన్న గౌడ్, జిల్లా కార్యదర్శిగా వేల్పుల వెంకటయ్య ఎంపికైనట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల కోసం కృషి చేస్తామని తెలిపారు. మా ఎంపికకు కు సహకరించిన మరిపెడ మండల శాఖకు, జిల్లా శాఖకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించిన వారిలో పిఆర్టీయూ బాధ్యులు రాంమోహన్, లింగయ్య, యాకయ్య, దత్తప్రసాద్, కృష్ణారెడ్డి, రవి, వెంకన్న, శ్రీను, విజయ్, విశ్వనాథం, రజిత, కవిత, రమ తదితరులు ఉన్నారు.

# పిట్లంలో ఘనంగా బారెడు పోచమ్మ బోనాలు

బిఎన్ఎస్ న్యూస్ ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పిట్లం: పిట్లం గ్రామంలో బారెడు పోచమ్మ బోనాల ఉత్సవాలు ఆదివారం భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా కళాకారుల నృత్యాలు, శివసత్తుల విన్యాసాలు, డీజే సౌండ్‌ల నడుమ బోనాలను పురవీధుల గుండా వైభవంగా ఊరేగించారు. భక్తుల జయజయధ్వానాలతో గ్రామ వీధులు మార్మోగాయి. అనంతరం ఊరి పొలిమేరలో ఉన్న బారెడు పోచమ్మ ఆలయానికి చేరుకున్న భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు.

# ఉపాధ్యాయుల క్రీడా పోటీలు ఘనంగా ప్రారంభం

-కొమరం భీం స్టేడియంలో జిల్లా స్థాయి పోటీలు.. -ఉత్సాహంగా పాల్గొన్న ఉపాధ్యాయులు
-క్రీడలతో శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు -ఉపాధ్యాయుల మధ్య ఐక్యత పెంపొందుతుంది: చిటమట రఘు



బిఎన్ఎస్ న్యూస్ ఏటూరునాగారం, ఆగస్టు 30:

సెప్టెంబర్ 5న నిర్వహించుకునే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్ (టీపీటీఎఫ్) ఆధ్వర్యంలో జిల్లా స్థాయి ఉపాధ్యాయుల క్రీడా పోటీలను ఏటూరునాగారం మండల కేంద్రంలోని కొమరం భీం స్టేడియంలో ఘనంగా ప్రారంభించారు. వివిధ మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు హాజరై వివిధ క్రీడా పోటీల్లో ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆత్మ కమిటీ జిల్లా చైర్మన్ చిటమట రఘు హాజరై క్రీడా పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు విద్యార్థులకు విద్యాబోధన అందించడమే కాకుండా తమ శారీరక, మానసిక ఆరోగ్యంపై కూడా ప్రత్యేక శ్రద్ధ వహించాల్సిన అవసరం ఉందన్నారు. నిత్య జీవితంలో క్రీడలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యంగా, ఉత్సాహంగా ఉండవచ్చని తెలిపారు. క్రీడలు శారీరక దృఢత్వాన్ని పెంపొందించడంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తాయని, ముఖ్యంగా ఉపాధ్యాయుల మధ్య స్నేహభావం, పరస్పర సహకారం, ఐక్యతను మరింత బలోపేతం చేస్తాయని పేర్కొన్నారు. ఉపాధ్యాయుల కోసం ఇలాంటి క్రీడా పోటీలను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. జిల్లాలోని వివిధ మండలాల నుంచి వచ్చిన ఉపాధ్యాయులు క్రీడా పోటీల్లో ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆటల్లో గెలుపోటములను పక్కనపెట్టి స్నేహపూర్వక వాతావరణంలో పోటీలు కొనసాగాయి. దీంతో కొమరం భీం స్టేడియం క్రీడాకారుల సందడితో కళకళలాడింది. ఈ కార్యక్రమంలో ఏటూరునాగారం ఎస్ఐ బి.మహేష్, గ్రామపంచాయతీ సర్పంచ్ కాకులమర్రి శ్రీలత, ఉప సర్పంచ్ పర్వతాల ఎల్లయ్య, స్థానిక హీరో సంజోష్, ఎంఈవో కోయడ మల్లయ్య, టీపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి నాయకుల పల్లె నాగరాజు, కోడి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.